
# మూడో రకం మనుష్యులు

- చొప్పదండి సుధాకర్



ఆనందం ఆత్మహత్యాయత్నం చేసుకొని విఫలమయ్యాడని విని నవ్వుకొన్నాను.

అలాగనీ ఆనందం నాకు శత్రువేమీ కాదు. పైపెచ్చు మంచి మిత్రుడు కూడా-! కానీ ఆత్మహత్యాయత్నం అన్నమాటే నాకు నవ్వు తెప్పించింది.

వాడు ఇటువంటి పని చేస్తాడని నేనెపుడో ఊహించాను, కానీ ఇంత తొందరగా- కాదు- కాదు- ఇంత ఆలస్యంగా చేస్తాడని అనుకోలేదు.

ఆనందం నేనూ బాల్యమిత్రులం! ఇద్దరం కలిసే తిరిగాం- కలిసే పెరిగాం-! ఒకే ఊరు-- పదో తరగతి దాకా ఒకే క్లాసూ- ఒకే స్కూలు -- ఆ తర్వాతే విడిపోయాం- తర్వాత ఎపుడయినా- పండగలకూ పబ్బాలకూ,

విందులూ వినోదాలకు తప్ప పెద్దగా రాకపోకల్లేవ్. కాకపోతే వాడేం చేస్తున్నాడో- ఏ పరిస్థితిలో ఉన్నాడో ఎప్పటికప్పుడూ నాకు ఏదో ఒక రకంగా తెలుస్తూనే ఉంది. అంతేగాక ప్రతి శుభకార్యానికి వాళ్ళింటికి ఆహ్వానిస్తూనే ఉంటాడు.

శుభకార్యమంటే గుర్తొచ్చింది! ఆనందంకిపుడు ముప్పయ్యేళ్ళ పైమాటే! అయినా వాడికి పెళ్ళికాలేదు. నా పెళ్ళయి పదేళ్ళు దాటుతోంది. మా పెద్దమ్మాయికే పదేళ్ళు. ఈ లెక్కన వాడికీ సకాలంలో పెళ్ళయి ఉంటే అంతే వయసుగల అబ్బాయో- అమ్మాయో ఉండి ఉండేవారు. కానీ ఎందుకో 'కుదరలేదు' ఫలితం వాడిప్పటికీ బ్రహ్మచారే!

అపుడెపుడో సొంత మరదలు ఉంది కదానీ, తల్లిదండ్రులు పెద్దగా తొందరపడలేదు. తీరా సమయానికి ఆ అమ్మాయికి వీడు నచ్చకపోవడంతో అహానికిపోయి వీడు ఆ అమ్మాయిని చేసుకోనని భీష్మించుకోవడంతో వ్యవహారం కాస్తా చెడింది.

తీరా ఆ అమ్మాయికి పెళ్ళి అయిపోగా వీడిలా మిగిలిపోయాడు!

❖ ❖ ❖

'ఇలా జరిగిందేమిత్రా' ఒంటరిగా నాతో వాపోయాడు.

"పోనీలేరా- నందూ- దేశంమీద ఆడపిల్లలు గొడ్డుపోయారా-" సముదాయించాను.

"అట్లా అని కాదురా చందూ- గోమతి కనీసం బావ అని కూడా చూడకుండా - మొహంమీదే ఎలా చెప్పగలిగిందిరా-" తిరస్కరించిన మరదలిని గుర్తుచేసుకొని బాధపడ్డాడు. "తప్పేముందిరా- నచ్చనిది నచ్చలేదని చెప్పింది - అంతే!" అనుకోకుండానే గోమతికి మద్దతిచ్చాను.

"నీ తలకాయ్! ఈ ప్రపంచంలో అన్ని నచ్చే చేస్తున్నామత్రా? కొన్ని కొన్నింటికి అడ్జస్టయిపోవాలి. ఆమాత్రం ఇంగితజ్ఞానం లేదా దానికి" గొంతులో ఉక్రోషం బుసకొట్టింది.

"అది వేరూ- ఇవి వేరు- ఇది పెళ్ళికదా- నచ్చని పెళ్ళిచేసుకొంటే జీవితాంతం బాధపడాల్సివస్తుందని కాబోలు తెగించేసింది."

"ఆమాటకొస్తే నాకూ నచ్చలేదు. అయినా మేనరికం- అని నాన్న చెబితే సర్దకున్నాను".

"పోనీలేరా బోడి సంబంధం. నీకు అంతకన్నా మంచి సంబంధమే దొరుకుతుందిలే!"

"దొరుకుతుందనుకో- కానీ విషయం అది కాదు గదా-!" సంభాషణ అంత త్వరగా ముగించడం ఇష్టంలేక కాబోలు నసిగాడు. ఆ విషయం నాకు తెలుస్తూనే ఉంది. ఆనందం చాలా బాధపడుతున్నాడు. నిజానికి గోమతికన్నా ఆనందమే అందగాడు. కాకపోతే స్థితిమంతుడు కాడు. కానీ గోమతి కుటుంబం మొత్తం వీళ్ళ దయాదాక్షిణ్యాల మీదే బతికిందని వినికిడి.

"ఈ గోమతి వాళ్ళు ఇప్పుడు స్థితిమంతులు గానీ- గతంలో మా ఇంట్లోనే పడి ఉండేవారు. ఇల్లు లేదూ- వాకిలీ లేదు. ఏదో పూట గడిస్తే చాలని దేబిరించే వాళ్ళు". తనలోతాను అనుకొంటున్నట్టుగా గొణుగుతున్నాడు.

విషయం నాకు తెలిసిందే అయినా ఆశ్చర్యం నటించాను!

"మరి ఎట్లా సంపాదించార్రా ఇంత ఆస్తిని" కావాలనే ప్రశ్నించాను.

"రియల్ ఎస్టేట్... బ్రోకరిజం-! వేల రూపాయలకు ప్లాట్లు కొని లక్షలకు అమ్మిపెట్టడం-" నింపాదిగా అన్నాడు ఆనందం!

"చేతిలో చిల్లిగవ్వ లేనివాడు వేల రూపాయల ప్లాట్లెలా కొనగలిగాడురా-"

"ఎందుకు కొనలేడు- వాడు మాటల మరారి" కసిగా పళ్ళ నూరాడు.

"అంటే- అర్థం కాలేదు."

"ఇందులో అర్థంకాకపోవడానికేముందిరా- ఫ్రెండ్సెవరయినా- రియల్ ఎస్టేట్ ప్రారంభిస్తేచాలు- తాను వాళ్ళకి ఎన్ని ప్లాట్లు అమ్మిపెడితే అందులో అయిదారు శాతం లాభం అడిగేవాడు.

ఒకోసారి ప్లాట్లు కూడా ఒకటో రెండో ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకొనేవాడు. ఇదంతా జీతానికి అదనం. అలా అలా పదేళ్ళలో పది ప్లాట్లు సంపాదించి వాటిని లక్షల రూపాయలకు అమ్మి ఇవాళ ఈ స్థితిలో ఉన్నాడు" సూక్ష్మం వివరించాడు.

"చిత్రంగా ఉందే--" నిజంగా ఆశ్చర్యపోయాను.

"చిత్రమేమిటీ అదృష్టం- అదీ గోమతి పుట్టినప్పటినుండేనని అంతా అంటుంటారు".

"అదీ సంగతీ-" ఏదో క్లూ దొరికినట్టు అనిపించింది.

"ఆఁ- దాంతో బిడ్డను 'గారాబంగా' పెంచాడు. అదెంతంటే అంతే! కాబట్టీ ఇవాళ నాన్నని కూడా కాదని ధైర్యంగా మాట్లాడుతోంది" గొంతులో కోపం పెచ్చరిల్లుతోంది.

"భలేగా ఉందిరా నీ కథ- ఎంతయినా నువ్వదృష్టవంతుడివి" అభినందనగా అన్నాను.

"ఏ--?" బిత్తరపోయి ఎదురు ప్రశ్నించాడు.

'కాకపోతే ఏమిత్రా- అంత గారాబంగా పెరిగిన దానికి ఖచ్చితంగా పొగరనేది ఒకటుంటుంది. అదేగనక ఉండి ఉంటే నువు ఆమెతో జీవితాంతం సర్దుకోలేక చచ్చిపోయే వాడివి- కాదంటావా ఆలోచించు" సూటిగా అడిగాను.

"నిజమేరా- నీ వాదన కరెక్టే". నిజాయితీగా ఒప్పుకొన్నాడు. మొహంలో కూడా ఏదో వెలుగు పొడసూపింది. తర్వాత చాలాసేపు మా ఇద్దరిమధ్య అలవికాని నిశ్శబ్దం!

"సో- ఫర్గెటిట్" చివరగా నేనే ముక్తాయింపు పలుకుతూ లేచి నిలబడ్డాను.

"అంతేనంటావా-?" ఇహ ఆలోచించలేనట్టు నిర్ణయం నాకే వదిలేశాడు.

"గన్ షాట్‌గా అంతే- ఇలా జరగడం కూడా మన మంచికే" ముగించాను.

అంతటితో ఆ విషయం మరుగున పడిపోయింది. కానీ చాలారోజుల తర్వాత మళ్ళీ మరో సంబంధం

చూసినపుడు ఆనందంకి ఆ అమ్మాయి నచ్చలేదు. ఆ అమ్మాయే కాదు ఆపై ఎంతమందిని చూసినా ఏదో లోపం కనిపించేది. ఏమీ లేకపోతే వీడే ఓ లోపం ఉన్నట్టు భ్రమించి 'ఆనంద'పడేవాడు. మొత్తానికి ఎన్ని ప్రయత్నాలుచేసినా వాడికి ఏదీ ఇంతవరకు నచ్చలేదు! ప్రాణ స్నేహితుడని ఊరుకొన్నాగానీ- అసలు వీడికి పెళ్ళంటే ఇష్టం లేదా-? ఇంకేదయినా?- అన్న సందేహం వద్ద ఆగిపోయిన సందర్భాలూ ఉన్నాయి.

ఏదేమయితేనేం? రోజులు గడచిపోతూనే ఉన్నాయ్. చదువు కొనసాగుతూనే ఉంది. నేను డిగ్రీ పూర్తిచేసి బ్యాంక్ ఎగ్జామ్ రాసి గ్రామీణ బ్యాంకులో క్యాషియర్‌గా స్థిరపడ్డాను. ఇహ ఉద్యోగ పర్వానికొస్తే ఆనందానిది మరో చరిత్ర!

మా బ్యాచ్‌లో అందరికన్నా ముందే ఉద్యోగం తెచ్చుకోవాలన్న ఆరాటంతో ఇంటర్ కాగానే టిటిసి రాసి ఉద్యోగం కొట్టేస్తానని ఛాలెంజ్ చేసి మూడుసార్లకు ప్రయత్నం విఫలమయి చివరకు డిగ్రీ బొటాబొటి మార్కులతో అయిందనిపించాడు.

డిగ్రీ కాగానే సివిల్స్ రాస్తానని పట్టుబట్టి ఆరుసార్లు ఆ ముచ్చటా తీర్చుకొని ఏజ్ బార్ అయిందనిపించాడు. ఆ పిదప బి.ఎడ్ రాసి ర్యాంకు రాక-- డొనేషన్ కట్టలేక అంగలార్చాడు. ఆఖరుకి పిజి డిప్లొమా ఇన్ కంప్యూటర్ చేసి అదేదో కంపెనీలో ఆరేడు వేలకు ఉద్యోగానికి కుదిరాడు.

ఇప్పటికే ఎమ్.సి.ఏ. చేస్తానని, ఎమ్.బి.ఎ చేస్తాననీ కనిపించినపుడల్లా ఊదరగొడ్తుంటాడు. ఏమయినా అంటే బాధపడ్తాడు గానీ వాడు చేసేదానికీ చెప్పేదానికి అస్సలు పొంతన ఉండదు. మాటలు ఎక్కువ, చేతలు తక్కువ.

వాడిలో ఏదయినా సుగుణం ఉందంటే- ఒకటే- అదీ- ఎవరికీ తెలిసిగానీ తెలియక గానీ హాని తలపెట్టడు అయితేగియితే తనకుతానే హాని చేసుకొంటాడు. అదే- ఇప్పుడు ఆత్మహత్యాయత్నం చేసుకొన్నట్టు-!

ఆనందం గురించి ఆలోచిస్తున్నకొలదీ మనసంతా కకావికలం కాసాగింది! ఇంకా నయం-- వాడికి బాధ్యతలేం లేవు. అసలు బాధ్యతలు లేకే వాడిలా తయారయ్యాడా- ఏమో విత్తుముందా- చెట్టుముందా? అన్నంత గంభీరమైన ప్రశ్న ఇది-! తల్లీతండ్రీ ఉన్నారు. వాళ్ళకి వీడొక్కడే కొడుకు. వీడేం చేసినా వాళ్ళు ఎదురుచెప్పరు. దాంతో ప్రతి నిర్ణయం వాడి చేతిలోనే. నిర్ణయమంటే గుర్తొచ్చింది. అసలు నిర్ణయం తీసుకొనే సత్తా- విచక్షణ ఆనందం గాడికి ఉన్నాయా-? ఇదో కొత్త ప్రశ్న- ఆశ్చర్యం కలిగించే ప్రశ్న- నిజమే వాడికి నిర్ణయం తీసుకొనే స్థాయి తెలివితేటలు లేవేమో? అవి లేకే ఇట్లా తిక్కతిక్కగా ప్రవర్తిస్తున్నాడా! ఇదేదో కొంచెం భిన్నంగా, ఆసక్తికరంగా అనిపిస్తోన్న ప్రశ్నలా ఉందేమిటీ! అసలు ఈ దిశగా నేనెపుడూ ఎందుకు ఆలోచించలేదు. అయినా ఈ తరహా ఆలోచన చేయాల్సింది ఆనందంకదా-?


"ఒకవేళ అతడు చేయకపోతే- నువు చేయకూడదా-?" అంతరాత్మ నిలేసింది.

"నిజమే కానీ వాడు నీ మాట వింటాడా?"

"వినకున్నా వినిపించు-- గట్టిగా నచ్చజెప్పు- పోయేదేముంది- అసలు ప్రయత్నించకుండానే సంశయపడడమేమిటీ?" అంతరాత్మ మళ్ళీ నిష్ఠురమాడింది.

"నిజమే ఓసారి ప్రయత్నిస్తే పోయేదేమిటీ?" మనసులో ఏదో కొత్తదనం!

రాత్రి చాలా పొద్దుపోయింది, చూసుకోలేదు. ఇంతలో అలా అలవోకగా వెళుతోన్న పిల్లతెమ్మెర ఒకటి నావైపు వచ్చి పలకరించింది. ఒంట్లో ఏదో జలదరింత- అప్రయత్నంగా గోడ గడియారం వైపు చూశాను. రెండున్నర-- బాప్‌రే- ఇంతసేపు వాడి గురించిన ఆలోచనల్లోనే గడిపానా? అనిపించింది. బాత్‌రూంకి వెళ్ళాలనిపించి బయటకొచ్చాను. రాత్రి పూట చంద్రుడు ఆహ్లాదంగా- ఇష్టారాజ్యంగా వెలిగిపోతున్నాడు. అటూఇటూ చూసి వెన్నెల పడుతున్నచోటు ఎన్నిక చేసుకొని మెట్లమీద కూచున్నాను. నిశ్శబ్దంగా--! మనసులో వేలకొలది ఆలోచనలు! ఆనందంని ఎట్లా మార్చాలి. అసలు మార్చాల్సిన అవసరం ఉందా- లేక నేనే పొరపాటుగా ఆలోచిస్తున్నానా? అన్నీ ప్రశ్నలే జవాబులు లేవు- రాత్రి మాత్రం నిశ్శబ్దంగా గడిచిపోతూనే ఉంది.



ఇప్పటికే ఎమ్.సి.ఏ. చేస్తానని, ఎమ్.బి.ఎ చేస్తాననీ కనిపించినపుడల్లా ఊదరగొడ్తుంటాడు. ఏమయినా అంటే బాధపడ్తాడు గానీ వాడు చేసేదానికీ చెప్పేదానికి అస్సలు పొంతన ఉండదు. మాటలు ఎక్కువ, చేతలు తక్కువ.

ఏదేమైనా ఏదో ఒకటి చేయాలి. 'ఆనందం'గాడి జీవితంలో 'ఆనందం' తేవాలి. ఒక కొత్త అధ్యాయం ప్రారంభంకావాలి. వరుస వైఫల్యాలనుండి వాడి జీవిత గమనాన్ని విజయాలవైపు మరల్చాలి. ఏదైనా భిన్నంగా చేయాలి! భిన్నంగా చేయాలంటే భిన్నంగా ఆలోచించాలి. ఒక సమస్యకు ఒకే పరిష్కారం ఉందనో... లేదనో ఆలోచించడంలో భిన్నత్వం ఎక్కడుంది? రకరకాల పరిష్కార మార్గాలు ఎందుకుండకూడదూ- అసలా కోణంలో ఎందుకు ప్రయత్నించకూడదూ? ఏ ఊరికైనా ఒకే మార్గం ఉండదు కదా- రకరకాల ప్రదేశాలనుండి రకరకాల దారులుంటాయి కదా- అలాగే ఆనందానికి నచ్చజెప్పడానికి ఎన్ని మార్గాలున్నాయో-

ఎవర్నయినా 'నువ్వీపని చేయగలవంటే' అంతే కామోసని నిర్లక్ష్యంగా వదిలేస్తారు. లేదా ఆలస్యంగా ఎపుడో చేస్తారు. కానీ నువ్వసలు 'చెయ్యలేవంటే' మాత్రం పంతానికిపోయి అపుడే మొదలెడతారు. అదీ ఒక జీవన నైపుణ్యమే! ఏదో పజిల్ సాల్వ్ అయిపోయినట్టు అనిపించింది. ఫ్రిజ్‌లోంచి నీళ్ళ బాటిల్ తీసి గడగడా ఖాళీచేసి హాయిగా నిద్రపోయాను.

❖ ❖ ❖

తెల్లవారుతూనే ఆనందం ఊరికి బయల్దేరాను!

ఎండాకాలం నోరు తెరిస్తే నోరు నిండా ఎండ. అయినా చచ్చీచెడీ సాయంకాలం అయేసరికి ఇల్లుచేరుకొన్నాను. వెళ్ళీవెళ్ళగానే వాళ్ళ అమ్మానాన్న భోరుమని ఏడ్చారు. ఆనందం గోడవైపు మొహం తిప్పుకొన్నాడు. నేనూ బలవంతంగా ఏమీ ఆరాతీయలేదు. వాడిని అదే స్థితిలో ఉండనిచ్చి నేనూ మౌనంగానే ఉండిపోయాను. మిత్రులు, బంధువులూ వాళ్ళూవీళ్ళూ వచ్చి పలకరించి పోతున్నారు. వాళ్ళతో మాట్లాడిన మాటలన్నీ క్రోడీకరిస్తే తేలిందేమిటంటే ఆనందం పూర్తి నిరాశలో కొట్టుమిట్టాడుతున్నాడు. పెళ్ళికాక- ఉద్యోగం రాక, ఉన్న స్థితీ, చేస్తూన్న ఉద్యోగం నచ్చక రోజురోజుకీ కృశించిపోతున్నాడు. వాడి అవతారం కూడా అలాగే ఉంది.

రాత్రి భోజనాలు కానిచ్చి మేడమీద పక్కలు వేసుకొన్నాం. నాకన్నా ముందే ఆనందు మేడపైకి చేరుకొన్నాడు. వాళ్ళమ్మ రాజమ్మ వృద్ధురాలు. ముక్కుతూ, మూల్గుతూ నీళ్ళు మేడపైకి తీసుకెళ్తుంటే నేనే అందుకొని "నే తీసుకెళ్తాలే అమ్మా! నువ్వెళ్ళూ"అని పంపించబోయాను. అంతే! భోరున ఏడుపు అందుకొంది. అయిదారు నిమిషాలు ఇరువురిమధ్య రాత్రి గడ్డకట్టుకుపోయింది. ఇంకాసేపయితే నేనూ ఏడ్చేలా ఉన్నాను.

"ఏడవకమ్మా! అంతా సర్దుకొంటుంది" ఓదార్చబోయాను.

"ఏం చేయమంటావు నాయినా... చెట్టంత కొడుకు కళ్ళముందు వాడిపోతోంటే" ఆపై మాట్లాడలేకపోయింది. నా నోరు ఆవేదనతో ఎండిపోయింది. మాటలు దొరకడంలేదు.

"ఏదయినా చేసి వాడి మనసు మార్చు నాయినా- బతుకు మీద ఆశ పెంచు" అంతకుమించి ఏం చెప్పాలో ఆగిపోయింది రాజమ్మ.

"అలాగేనమ్మా-" ఏం మాట్లాడాలో తెలియకున్నా అభయమిచ్చాను. ఆమె మరికాసేపటికి వెళ్ళిపోయింది. నీడగా చాటుగా వింటోన్న వాళ్ళ నాన్న కూడా అక్కడినుండి కదిలాడు.

నాపై ఎన్ని ఆశలు వీళ్ళకూ- ఎలా వీళ్ళను ఓదార్చగలను?

ఇపుడు నే మాట్లాడే ప్రతి మాటకూ చాలా విలువుంది. దానిని మరింత హెచ్చిస్తూ ఆనందంగాడితో మాట్లాడాలి. ఔరా- మాటలకెంత శక్తి ఉంది-! సరియైన పద జాలంతో రూపుదిద్దుకొనే వాక్యాలు అణుబాంబులకన్నా తీక్షణమైనవి-!

నిశ్శబ్దంగా మేడ పైకి చేరాను. వాడు అటు తిరిగి పడుకొన్నాడు. నిద్ర పోలేదని నాకు గస్‌షాట్‌గా తెలుసు. కానీ ఎట్లా సంభాషణ మొదలెట్టాలో మాత్రం తెలియడంలేదు. చాలాసేపు నిశ్శబ్దంగానే గడిచిపోయింది. కనులు మూత పడిపోతున్నాయ్. ప్రయాణ బడలిక కాబోలు! పొరపాటుగా నిద్రపడితే అంతే! తెల్లవారిపోవడం ఖాయం. నా రాకకి అర్థం లేకుండాపోతుంది. ఏదోఒకటి మాట్లాడాలి. గొంతు సవరించుకొన్నాను. మరో నిమిషం గడచిపోయింది.

"మొత్తానికి చావాలనే నిర్ణయం కూడా ఖచ్చితంగా తీసుకోలేకపోయావన్న మాట."

నాకు తెలియకుండానే నా నోట్లోంచి వచ్చిన మొదటి మాట అది.

"ఏంట్రా అంటున్నావ్?" చివుక్కున ఎదురు ప్రశ్నించాడు ఆనందం.

"కాకుంటే ఏమిట్రా-- చివరకు ఆత్మహత్య కూడా తిన్నగా చేసుకోలేని అసమర్థుడివా?"

"ఒరేయ్ ఏమిట్రా చందూ".

"ఔరా- చందూనే అంటున్నాను- మొదట్నుంచి నీకు ఏదీ చేతకాదు."

"నాకా-- ఏదీ చేతకాదా?" విస్మయపడిపోయాను.

"ఔను నీకే- మరీ ముఖ్యంగా నిర్ణయం తీసుకోవడం అస్సలు చేతకాదు."

"అంటే-?"

"అంటే ఏముందిరా-- రెండు కోళ్ళవెంట పరుగెడితే ఏదీ పట్టుకోలేమని తెలియదా?" సూటిగా అడిగాను.

(మిగతా 27వ పేజీలో)

**(25వ పేజీ తరువాయి)**

"నేనా-- రెండు కోళ్ళ వెంట పరుగెత్తినట్టు ఏం చేశాను?"

"ఒరేయ్ నందూ- తననుతాను తెల్సుకోవడమే నిజమైన జ్ఞానంరా-" నాకు తెలియకుండానే మాటలు తూటాల్లా దూసుకొస్తున్నాయ్! వాటివల్ల వాడు బాధపడ్తాడని తెల్సినా నిభాయించుకోవడం లేదు. బాధపడ్డా ఏం చేస్తాడు? చేయవలసిన అఘాయిత్యం ఇప్పటికే చేసేశాడు కదా! అదీ నా ధీమా-!

"నన్ను నేను తెల్సుకోవడమేమిట్రా కొత్తగా" బిత్తరపోయాడు.

"ఒరేయ్ ఆనందం- నీకు నది దాటాలని ఉంటుంది. దాటే యత్నంలో మధ్యకురాగానే ఎందుకులే వెనక్కి వెళ్ళాలని అనిపిస్తుంది. విశేషమేమిటంటే అప్పుడు వెనక్కి వెళ్ళినా ముందుకెళ్ళినా ఒకటే దూరం. కానీ నువు వెళ్ళవు. వెనక్కే వచ్చేస్తావు. తిరిగొచ్చాకా మళ్ళీ ఎందుకు తిరిగొచ్చానా అని కుమిలిపోతావ్."

"చందూ-"

"మాట్లాడకు విను అంతే! నీకు పని చేయాలని ఉంటుంది. చేయకూడదనీ ఉంటుంది. చేస్తే ఒక ఆనందం. చేయకపోతే మరో ఆనందం.. రిస్క్ లేదు కదా- చాలామంది రెంటిలో ఏదో ఒకటి కోరుకుంటారు. కానీ నీలాంటి మూడో రకం మనుషులు రెండూ కాని డోలాయమాన పరిస్థితినే కోరుకుంటారు. మీకు ఆనందం ఈ పరిస్థితిలోనే ఉంటుంది. అది తెలియకే ఈ ఘర్షణ సంఘర్షణ!! నీ విషయానికొస్తే నీవు అటువంటి వాడివి కాబట్టి నీ పేరులో తప్ప బతుకులో ఆనందం లేదు. ఇదే నీ దుస్థితికి అసలు కారణం". ఎట్లా మాట్లాడానో గానీ నిక్కచ్చిగా నిర్మొహమాటంగా అనేశాను.

దాదాపు అరగంటపాటు వాడు ఏమీ మాట్లాడలేదు. నిజం చెప్పొద్దు! ఆ మౌనం చూసి నాకు భయమేసింది.

"ఐతే మరిప్పుడు నేనేం చేయాలి!" చివరకు వాడే నోరు విప్పాడు.

"ఏం లేదు. ఎవర్నోఒకర్ని నచ్చిన వారిని చేసుకో! నచ్చకపోతే పెళ్ళి ఊసే మర్చిపో"

"పెళ్ళి మానెయ్యాలా-" గొంతులో దాచినా దాగని దిగులు.

"మానెయ్యమని కాదు. ఇంతమందిలో అసలెవరూ నచ్చలేదా నీకూ" మాటమార్చాను.

"ఎందుకు నచ్చలేదూ- ఇద్దరు ముగ్గురు, ఫరవా లేదు."

> నీకు పని చేయాలని ఉంటుంది. చేయకూడదనీ ఉంటుంది. చేస్తే ఒక ఆనందం. చేయకపోతే మరో ఆనందం.. రిస్క్ లేదు కదా- చాలామంది రెంటిలో ఏదో ఒకటి కోరుకుంటారు. కానీ నీలాంటి మూడో రకం మనుషులు రెండూ కాని డోలాయమాన పరిస్థితినే కోరుకుంటారు.

"వాళ్ళలో ఎవర్నో ఒకర్ని చేసుకో."

"కానీ- కానీ వాళ్ళు పూర్తిగా నచ్చలేదు. ప్రతి ఒక్కరిలో ఏదో లోపం".

"బుద్ధిలేదురా నీకు- ఆమాటకొస్తే నీలో లేవా లోపాలు--" గద్దించాను.

"ఎందుకు లేవూ- ఉన్నాయి" సన్నగా గొణిగాడు.

"గుడ్ అదీ మంచి అబ్బాయి లక్షణమంటే! లోపాన్ని లోపం అని ఒప్పుకోవడం ఎన్నడూ లోపం కాదురా-!" ఎట్లా మాట్లాడానో గానీ వాక్యం అద్భుతంగా కుదిరింది.

"అంతేనా-"

"అంతే- ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. తొందరగా పెళ్ళిచేసుకో- ప్రాబ్లెమ్స్ అన్నీ సాల్వ్ అవుతాయి. నీకంటూ ఒకరున్నారన్న అనుభూతికి మరేది సాటి రాదు."

"కానీ నా జీతం సరిపోదు కదా-"

"సరిపోదు- ఎవరికి సరిపోదు- ఉన్నంతలో సర్దుకోవడమే గొప్పతనం"

"చందూ--".

"ఔనా- కలెక్టర్‌కి కూడా తన జీతం తృప్తినివ్వదు తెల్సా-"

"ఔనా-" నందు లేచి కూచున్నాడు.

"ఖచ్చితంగా అవునూ- ఉన్నంతలో సర్దుకోవాలి! అక్కడే బాధ్యత మొదలవుతుంది. అది లేకే నీకీ తిప్పలంతా-" మర్చిపోతానేమో అని భయపడ్డ ఆఖరి ముక్కా అనేశాను.

ఆ తర్వాత మామధ్య మాటల్లేవు- రాత్రంతా జాగరమే- ఆలోచనల్లోనే తెల్లారిపోయింది.

"గుడ్‌మార్నింగ్ ఆనంద్" ఆహ్లాదంగా విష్ చేశాను.

"వెరిగుడ్ మార్నింగ్ చందూ- నువు రాకుంటే నేనీ పాటికి చచ్చి ఊరుకుండేవానిని".

కళ్ళలో నీళ్ళు చిప్పిల్లుతోంటే నా చేతులు పట్టుకొన్నాడు.

"నీ తలకాయ్-- నీకు చచ్చే తెలివితేటలు కూడా లేవు."

"ఒరేయ్ నీకు దండం పెడ్తా- ఇచ్చిన ట్రీట్‌మెంట్ చాలు- నన్నిక వొదిలెయ్".

"దటీజ్ గుడ్-- ఇక నాకు సెలవా-"

"అప్పుడే"

"ఇంకేముంది వెళ్ళక--"

"నా పెళ్ళికి ఉండకనే-"

"ఎప్పుడ్రా పెళ్ళి- అమ్మాయి ఎక్కడ?"

"ఈవారమే పెళ్ళి- అమ్మాయి పక్క వీధిలోనే ఉంది."

"నిజమా-?"

"నిజమే- నీతోడు- అమ్మాయికి నేనూ ఇష్టమే"

"ఎన్నెళ్ళుగా- సారీ రోజులుగా-?"

"రెండేళ్ళుగా- ఎంతో ప్రేమా- ఇష్టం-"

"మరి రెండేళ్ళు ఎందుకాగావురా స్టుపిడ్."

"ఎందుకా నిర్ణయం తీసుకొనే శక్తిలేక."

"ఆఁ--" ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టాను.

"ఆఁ--" ఆనందం ఆనందంగా అన్నాడు.

నా ప్రయాణం ఇలా ఫలవంతమైనందుకు నాకూ ఆనందంగా ఉంది! ★


**రచయిత చిరునామా:**
**చొప్పదండి సుధాకర్**
ఇం.నెం.12-5-75/9/1/బి,
షిర్డీసాయి గుడి దగ్గర, సాయి విద్యానగర్,
సిద్దిపేట- 502 103.